# ఆనందరావు - కన్నీళ్లు

- శంకరమంచి పార్ధసారధి

**నవ్వటం తెలియని వారు ఉండొచ్చు, కాని, కంట తడి పెట్టడం తెలీని వారుంటారా అని ఎవరికైనా సందేహం కల్గితే , దానికి సమాధానం ఆనందరావు.**

**అరవై ఏళ్ళ అతని జీవితంలో ఏడ్చిన సందర్భాలు, కంటతడి పెట్టించిన సన్నివేశాలు కానీ ఎదురవ్వలేదా అంటే మధ్య తరగతి మనిషి జీవితంలో లేకుండా ఎలా ఉంటాయి. చాలా ఉన్నాయి. నిరుద్యోగం, ఆకలి, అప్పులు, తల్లిదండ్రుల మరణం, ఇలా ఇంకా చాలా ఉన్నాయి. ఈ సందర్భాలన్నింటిలో అతడు బాధపడ్డాడే గానీ కంటనీరు చిందలేదు. కష్టాల్లో అలా నిబ్బరంగా రాయిలాగా ఉండగలగటం మనోబలమా, రోగ లక్షణమా ?**

**సరిగ్గా ఇదే అనుమానం అతని భార్య మాలక్ష్మికి కలిగింది.**

కాపురానికొచ్చిన ఇన్ని సంవత్సరాల్లో, అప్పుడప్పుడు చూసింది – అతడు నవ్వితే ఏడ్చినట్లుంది. మరి ఏడిస్తే ? ఈ ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది. కారణం అతడు ఏడవగా చూసే అవకాశం ఆవిడకి రాలేదు. మొదట్లో వింతగా అనిపించినా తర్వాత తర్వాత అనుమానంగా భయంగా మారింది – ఇదే వన్నా రోగలక్షణమా అని.

ఈ విషయం గురించి ఆవిడికి అన్నయ్య వరస బంధువు భక్తవత్సలతో చర్చించింది గూడా. భక్తవత్సలం సైకాలజీ లెక్చరరు భార్యకి విడాకులిచ్చి కూతురితో పాటు ఒంటరిగా ఉంటున్నాడు. మా లక్ష్మి వీలు చిక్కినప్పుడల్లా అన్నగారి ఇంటికెళ్ళి ఆ పని ఈ పని చేసి, కాసేపు మాట్లాడి, ధైర్యం చెప్పి వస్తూ ఉంటుంది. అలా వెళ్ళిన ఒకసారి ఆనందరావు కన్నీళ్ళ గురించి అడిగింది. దానికి తేలిగ్గా నవ్వేసి ‘ అది రోగం కాదు, మానసికి సమస్యా కాదు, అదొక స్వభావం , జరిగే ప్రతి పరిణామం వెనుక ఒక కారణం

ఉంటుంది. విపత్తు గానీ, విషాద ఘటన గానీ జరిగినప్పుడు దాన్ని మాత్రమే చూసేవాడు దు:ఖపడతాడు, ఏడుస్తాడు, అదే ఆ ఘటన మూలం గురించి, కారణం గురించి ఆలోచించేవాడికి, సహజపరిణామంలా కనిపించి సాధారణంగా ఉండగల్గుతాడు. అంతెందుకు, ఈ ప్రశ్న బావగారినే అడిగి చూడు ఏం సమాధానం చెప్తాడో చూద్దాం ' అని ఒక ఉచిత సలహా గూడా ఇచ్చాడు.

మర్నాడు ఆనందరావు టీవీలో పాత దేవదాసు చూస్తున్నాడు. ప్రక్కనే ఉన్న మాలక్ష్మి మాత్రం భర్తగారి ఫీలింగ్స్‌ని జాగ్రత్తగా గమనిస్తోంది. సినిమాలో పతాక సన్నివేశం. ప్రియురాలికిచ్చిన మాటకోసం ప్రియుడు అనారోగ్యంతో అర్ధరాత్రి గాలివానలో ఎద్దుబండిలో ఖళ్‌ఖళ్‌మని దగ్గుకుంటూ వెడుతున్నాడు. అక్కడ ప్రియురాలు, భర్త ఇంట్లో దేవుడికి దండం పెడ్తూ మాజీ ప్రియుడి క్షేమం గురించి ప్రార్ధిస్తోంది. సినిమాలో హైలైట్ సన్నివేశం. చివర్లో హీరో, ప్రియురాలు ఇంటిముందే ప్రాణం విడుస్తాడు. ఆ సంగతి తెల్సి శవాన్ని చూడాలని వేగంగా వస్తున్న ఆమెని ఆపలేకద్వారాలు మూసేస్తారు. ఆమె అక్కడే ప్రాణాలు విడుస్తుంది. సినిమా పూర్తయ్యింది. మా లక్ష్మి కళ్ళు తుడచుకుంది. చీర కొంగు ఆనందరావుకి అందించింది. అతడు ఆశ్చర్యంగా ' దేనికి ? అనడిగాడు, ' కళ్ళు తుడుచుకోండి ' అంది. ' అవసరం లేదు ' అని వెళ్ళబోతుంటే ' ఏవండీ ప్లీజ్ ఒక్క క్షణం అలా కూర్చోండి ఆ సినిమాని ఆ సన్నివేశాన్ని చూసి ఏడవని తెలుగు వాడు లేడు, మీ కళ్ళు మాత్రం కనీసం చెమర్చలేదు. మీకు దు:ఖం , బాధ తెలీవా ! ' ఆవేశంగా అడుగుతున్న ఆమెకి మధ్యలోనే అడ్డుపడి ' అవేంకావు, నేనూ మనిషినే, నాకూ మనసులు, స్పందన ఉన్నాయ్ – ఈ సినిమాలో హీరోది స్వయంకృతాపరాధం, చేసుకున్న వాడికి చేసుకున్నంత అని, అలాంటి వారి గురించి విలువైన మన కన్నీరు వృథా చెయ్యటం దండగ ' అంటూ లేచి వెళ్ళిపోయాడు.

భక్తవత్సలం చెప్పింది నిజమే అనిపించింది మా లక్ష్మికి, రోగ లక్షణం కాదని తెలీటంతో కాస్త వూరట కలిగింది.

ఆనందరావు అద్దెకుంటున్న ఇంటిపైన మూడు గదుల పోర్షన్ ఖాళీ అయింది. అందులో ఉంటున్న బ్యాంక్ ఆఫీసరు రంగనాథం ట్రాన్స్‌ఫర్‌మీద వరంగల్ వెళ్ళాడు. ఆ సంగతి తెల్సిన మా లక్ష్మికి భక్తవత్సలం గుర్తుకొచ్చాడు. ' ఏవండీ పైన ఖాళీ అయిన పోర్షన్ మా భక్తవత్సలం అన్నయ్యకిపిద్దామండీ, కూతురు పెళ్ళి చేసుకుని వెళ్ళాక మరీ ఒంటరివాడయి పోయాడు. మనకి దగ్గరగా ఉంటే పలకరించడానికి నే ఉంటా. కాబట్టి కాస్త ధైర్యంగా ఉంటాడు, ' ప్లీజండీ ' ప్రాదేయపూర్వకంగానే అడిగింది.

భార్య దూరమయ్యాక కూతుర్ని అపురూపంగా పెంచుకున్నాడు భక్తక వత్సలం. ఎక్కడ తల్లి మీద దిగులు పడుతుందోనని గారాభంగా పెంచాడు. ఏ లోటూ రానివ్వకకుండా అడిగినదల్లా ఇచ్చాడు. మంచి చదువు చెప్పించాడు. మంచి సంబంధం చూసి పెళ్ళి చేద్దామని కలలు కంటుండగా , ఒకరోజు వేరే కులం కుర్రాడిని కనీసం మాట మాత్రమైనా చెప్పకుండా పెళ్ళి చేసుకుని ఇంటి ముందు ఇద్దరూ ట్యాక్సీదిగేరు.

భక్తవత్సలం అవాక్కయ్యాడు. కనీసం మర్యాద గౌరవం లేకుండా కూతురు చేసిన పనికి చాలా నొచ్చుకున్నాడు. కానీ కూతురు పట్ల మమకారం అతడిని కట్టి పడేసింది. క్షమించేలా చేసింది. వాళ్ళిద్దరూ తన వద్దే ఉంటారని, ఉండాలని ఆశించాడు. వేరే ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు. తన బట్టలు, సామాను తీసుకుని వెడుతుంటే కూతురి చేతులుచ్చుకుని బావురుమన్నాడు. అమ్మా పల్లవీ నాకు కూతురైనా కొడుకైనా నువ్వే. నా జీవితాన్ని నువ్వే కడతేర్చాలి. అనాధగా పోయే నికృష్ట పరిస్థితి నాకు రానివ్వకు అన్నాడు ఏడుస్తూ.

జరిగినదంతా ఆనందరావుకి తెల్సు కాబట్టి భార్య చెప్పిన ఆలోచనకి సరేనన్నాడు.

ఇంటి యజమాని రామ్మూర్తి గారితో మాట్లాటం, ఆయన సరే అనడంతో భక్తవత్సలం మూడు రోజుల తర్వాత వచ్చి పై పోర్షన్లో జాయినాయ్యాడు.

మాలక్ష్మికి బంధుప్రీతి ఎక్కువ. పైగా ఒంటిరి వాడన్న జాలి కొద్దీ, భక్తవత్సలానికి అన్ని సపర్యలు చేయసాగింది. పనిమనిషి చేత పని చేయించడం, లాండ్రీకి బట్టలు వేయటం, వచ్చాక వాటిని నీట్‌గా బీరువాలో సర్దడం – ఇలా ప్రతి విషయంలో అతనికేం లోటు రాకుండా చూసుకోసాగింది. అయినా భక్త వత్సలం ఏదో పోగొట్టుకొన్నవాడిలా కుమిలిపోసాగాడు. రెండు నెలల్లోనే అతడి ఆరోగ్యంలో తేడా వచ్చింది. తరుచు జ్వరంగా మొదలయ్యి, డాక్టర్లు అతడికి అన్ని పరీక్షలు చేసి, చివరకు గొంతు క్యాన్సర్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం ఆస్పత్రిలోనే ఉండి ట్రీట్మెంటు తీసుకుంటున్నాడు.

☆ ☆ ☆

నెలరోజుల ట్రీట్మెంటు తర్వాత ఒకరోజు తెల్లవారురుఝామున ఆసుపత్రి నుంచి ఫోన్ వచ్చింది, భక్తవత్సలం చనిపోయాడని, వచ్చి బాడీని తీసుకెళ్ళమని. ఆ సంగతి భార్యకి చెప్పాడు. ఘొల్లుమని ఏడ్చింది. మొన్ననే డాక్టర్లు అనుమానంగా చెప్పారు. భార్య విషయంలో కన్న కూతురు చేసిన పనితో కుంగిపోయిరోగం తెచ్చుకున్నాడు. ఏనాడు ఏ

పాపం చేసాడో గాని అలా అనాథలా పోయాడు.

సరే ఓనరుకి ఒకమాట చెప్పి బాడీని తీసుకొచ్చే ఏర్పాటు చేస్తానంటూ ఆనందరావు బయల్దేరాడు.

అప్పటికే రామ్మూర్తి గారు మార్నింగ్ వాకింగుకి వెళ్ళొచ్చి పేపరు చూస్తున్నాడు. ఆనందరావు వెళ్ళి నమ్రతగా విష్ చేసి చావు కబురు చల్లగా చెప్పి బాడీని తీసుకురావడానికి వెడుతూ ముందుగానే మీకోమాట చెప్పాలి గదా ....'

అంటే ?

అదేనండీ అతని తాలూకు వారంతా వచ్చేదాకా బాడీ మన ఇంటి ముందు వుంచుదామని....

నో నో ఇంకా నయం, ముందుగా చెప్పావ్. అలా వీలుకాదు. దగ్గరలో మా మనవరాలి పెళ్ళుందని రంగలు, సున్నాలు వేయిస్తే, ఆ ఇంటి ముందు శవాన్ని పడుకోబెడతానంటావా ? అదేం కుదర్దు మీరు వేరే ఏర్పాటు చేసుకోండి అనేసి పేపరు వెనుక మొహం దాచుకున్నాడు.

ఆ మాటకి ఆనందరావు అలాగే నిలబడి ఒక్క క్షణం ఆలోచించాడు. ఆస్పత్రి నుండి అంబులెన్స్ బయల్దేరింది. మార్గమధ్యంలో ఉంది.

ఇప్పుడేమిటి చెయ్యటం ?

జరగాల్సిన కార్యక్రమాలు జరగాలి కదా మూర్తి గారూ, మీరు పెద్దవారు , ప్రాక్టికల్‌గా ఆలోచించండి ఈ మహానగరంలో నివాసముంటున్న దగ్గర కాక, వేరే చోట శవాన్ని ఎలా ఉంచుతాం , ఎవరు మాత్రం వొప్పుకుంటారు ? మనసు పెట్టి ఆలోచించండి.

ఆ మాటకి ఆయన ఉగ్రనరసింహుడిలా కోపంతో పేపరు విసిరికొట్టి ' ఇదిగో ఆనందరావ్ ఈ విషయంలో ఆర్గుమెంట్లొద్దు , నేను ఓనర్ని, నామాటే ఫైనల్, ఇంటిముందు శవాన్ని దించటానికి వీల్లేదు, మైండిట్ – వెళ్ళు ' అంటూ బయటికి చెయ్యి చూపించేడు

ఆనందరావుకు పౌరుషం వచ్చింది. కోపంగా అరిచాడు.

ఇళ్ళల్లో అద్దెలకుండే వారు మనుషులు కారా, వారికి హక్కులుండవా . అద్దె పేరున రకరకాల పేర్లతో డబ్బు పిండుకున్నావే, ఆ మనిషి చనిపోతే , కనీస మర్యాద సభ్యత లేకుండా మాట్లాడతావా.

మిస్టర్ యూ ఆర్ టాకింగ్ టూ మచ్.... సరిగ్గా ఆ సమయానికి మా లక్ష్మి పరుగు

పరుగున వచ్చి ఆనందరావుని చెయ్యి పుచ్చుకుని లాక్కొని పోతూ ‘ పదండి పోట్లాట్లు అరచుకోటాలు దేనికి, పోయినవాడి ఖర్మ, ప్రాణాలు పోయినా కష్టాలు మాత్రం వాడిని వదల్లేదు ’ అంటూ ఇంటోకి తీసుకెళ్ళి గ్లాసుడు నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

నీళ్ళు త్రాగేక బాధ తొలిగిపోలేదు గాని, ఆవేశం చల్లారింది.

మీ అన్నయ్య కూతురుకి ఫోన్ చేశావా ? అనడిగాడు.

పల్లవికా చేసాను. బయల్దేరింది. అల్లుడు కూతురు వస్తున్నారు. వాడి ఆస్తికి వారే వారసులయినపుడు. శవాన్ని ఏం చేయాల్సో వారే చూసుకుంటారు.

ఆనందరావుకి ఆ మాట సబబుగాను, న్యాయం గానూ అనిపించింది.

అంతలో ఇంటి ముందు టాక్సీ ఆగింది. భక్తవత్సలం అల్లుడూ కూతురు దిగేరు.

మాలక్ష్మి పరుగు పరుగున వెళ్ళి ఆ పిల్లని వాటేసుకుని ఏడుస్తూ ‘ మీ నాన్న వెళ్ళిపోయాడే అమ్మా, పోయే ముందు నరకం అనుభవించాడు. నీ గురించి , నిన్ను చూడాలని ఎంతగా కలవరించాడో ’ ఆనందరావు ఆమె వంకే చూస్తున్నాడు. ఆమె బాధనీ , దు:ఖాన్ని నటిస్తోందని అతనికి ఇట్టే అర్ధమైంది. తండ్రి శవం గురించి అడుగుతుందని ఆశించాడు, ఎదురు చూసాడు.

కానీ దానికి భిన్నంగా ‘ అత్తా మా నాన్న ఇంటి తాళం వుందా ’ అనడిగింది. కళ్ళు తుడుచుంటూ, ఆనందరావు దంపతులు విస్తుపోయారు.

వెంటనే ఆనందరావు తేరుకుని భార్యతో ‘ వాళ్ళ వాళ్ళకి ఫోన్లు చేసుకుంటుందేమో పాపం, ఇయ్యి ’ అన్నాడు. మా లక్ష్మిలోనికి వెళ్ళింది.

ఇక్కడ ఇంటి ఓనరు బాడీని దింపటానికి వీల్లేదని చెప్పాడు, మీ వాళ్ళెవరైనా వచ్చేవరకు శవాన్ని ఉంచాలి గదా, మీ ప్లేసుకు తీసుకువెళ్ళడం తప్ప వేరే మార్గం కనిపించడం లేదు.

అలా కుదర్దు అంకుల్. మా పేరెంట్సున్నారు, పైగా మాది కొత్త కాపురం , మా వాళ్ళు వొప్పుకోరు అన్నాడు – అల్లుడు.

అయినా వచ్చే వాళ్ళెవరూ లేరు. అంబులెన్సులోనే బరియల్ గ్రౌండ్‌కి తీసుకెళ్ళి ఆ ప్రోగ్రాం ఫినిష్ చెయించండి.... అంది కూతురు.

ఆనందరావు గుడ్లప్పగించి వింటున్నాడు. మాలక్ష్మి తెచ్చి ఇంటి తాళం ఇచ్చింది. కూతురు అల్లుడు ఆదుర్దాగా మెట్లెక్కి పైకి వెళ్లారు.

అక్కడున్న ఇద్దరూ ప్రేక్షక పాత్రకి పరిమితం అయ్యారు.

అంబులెన్స్ వచ్చి ఇంటిముందు ఆగింది. డ్రయివరు ‘ సార్ బాడీని ఎక్కడ

వుంచమంటారు ' అనడుగుతున్నాడు.

ఇలాంటి సంఘటన ఆనందరావు జీవితంలో తొలిసారి కావటం చేత, కళ్లముందరి సన్నివేశాన్ని నమ్మలేకపోతున్నాడు. పది నిమిషాల తర్వాత పైకి చేతులు వూపుకుంటూ వెళ్లిన వారిద్దరూ రెండు సూటుకేసులు మోసుకుంటూ క్రిందికి వచ్చారు. ఇద్దరూ సరాసరి ట్యాక్సీ డిక్కీలో రెండు పెట్టెలూ వుంచి,, పక్కనే వున్న అంబులెన్స్ వంక అనుమానంగా చూస్తూ ' బాడీ వచ్చిందా ' అనడిగింది. ' అవునమ్మా పద చూద్దువు గానీ ' అనగానే కంగారుగా ' వొద్దు అంకుల్, తట్టుకోలేను, ఇదిగో ఈ మనీ ఉంచండి ., ఇవ్వాళ నాకు హైటెక్స్‌లో ఇంటర్వ్యూ వుంది. మినిస్టరు గారి రెకమెండేషన్, అటెండ్ కాకపోతే మొత్తం అప్సెట్టవుతుంది. అన్నీ మీరే చూసుకోవాలి. బైదిబై యాషెస్, బోన్సు ప్రిసర్వ్ చేయించండి, కాశీ పంపించి గంగలో కలిపిద్దాం ' అని గడగడా అనేసి దూరంగానే నిలబడి అంబులెన్స్‌కి నమస్కరించి, వెళ్ళి టాక్సీ ఎక్కి కూర్చుంది.

టాక్సీ వెళ్లిపోయింది.

☆ ☆ ☆

భక్తవత్సలం ఆఖరి ప్రయాణం మొదలయ్యింది.

డ్రైవరు పక్కన కూర్చున్న ఆనందరావుకి ఆలోచనలు వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

మనిషి జీవితానికి అర్థం మారిందా ? కన్నతండ్రి చనిపోతే కనీసం కంటితో చూసే సమయం, మనసు , సంస్కారం లేవా ? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్నాయా ? అదే నిజమైతే మనిషిని మనిషిని కలిపే ఆ ప్రేమలు, మమకారాలు, బంధాలు , సంబంధాలు , ఇవన్నీ లేని మనిషి, అలాంటి మనుషులుండే ఈ సమాజం – ఆలోచించటాకికే భయం వేసింది.

' సార్ బరియల్ గ్రౌండ్ వచ్చింది సార్ ' డ్రయివరు పిలుపుతో ఆనందరావు కళ్లు తెరిచాడు. కిందకి దిగి చుట్టూ చూసాడు.

శ్మశానం – చనిపోయిన వారిని ఖననం చేసే స్థలం.

తల తిప్పి వీధి వైపు చూసాడు.

జనం, జనం, కార్లలో బస్సుల్లో ఆటోల్లో నడుస్తూ పరిగెడుతూ జనం.

ఇక్కడ చనిపోయిన వారిని మాత్రమే ఖననం చేస్తారు. కానీ అక్కడ ? మనసుని , ప్రేమల్ని , ఆప్యాయతల్ని, సంబంధాల్ని , కరుణ , జాలి, ప్రేమ , అన్నింటిని ఖననం చేసి పాతి పెట్టి డబ్బు జబ్బుతో చచ్చినట్లు బతికే మానవమృగాలు.

ఆనందరావుకి  ఆలోచించిన కొద్దీ  ఏమిటోగా అనిపించింది.

పెద్ద  శ్మశానంలోంచి చిన్న  శ్మశానానికి వచ్చినట్టనిపించింది, తొలిసారిగా  కళ్ళు చమర్చినాయ్.

కంటతడి పెట్టడం తెలీని  ఆనందరావు  ఇప్పుడు  కంటికి మంటికి ఏకధారగా  పసి కుర్రవాడిలా ఏడుస్తున్నాడు.

**------- అయ్యిపోయింది -------**